


## విజృంభించిన ఒంటరి ఏనుగు


కొబ్బరి చెట్లను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** పులిచెర్ల మండలంలోని దేవళంపేట, పాలెం పంచాయతీలలో ఒంటరి ఏనుగు మంగళవారం తెల్లవారుజామున పంటలపై విజృంభించింది. ఈ దాడిలో కొబ్బరి చెట్లు, మామిడి, వరి పంటలపై దాడి చేసి ధ్వంసం చేసింది. ఏనుగుల గుంపులో నుంచి దారి తప్పిన ఒంటరి ఏనుగు దేవళంపేట గ్రామం కొంగర వారి పల్లి వద్ద సురేంద్ర నాయుడు, మునిరత్నం నాయుడు తదితర రైతులకు చెందిన వ్యవసాయ పంటలను ధ్వంసం చేసింది. ఈ దాడిలో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. అటవీ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పులిచెర్ల మండలంలో ప్రతిరోజు ఏనుగుల గుంపు దాడులతో రైతులు నష్టపోతున్నాయి. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

# మామిడి రైతులకు రూ.146.84 కోట్లు జమ

- 20వేల మంది రైతులకు లక్షకు మించి...
- 21మందికి రూ.5 లక్షలు పైగా లబ్ధి
- సబ్సిడీ జమకాని వారికి 30లోపు అవకాశం
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై కలెక్టర్ మండిపాటు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**ప్రజాశక్తి - యాదమరి** మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని 31,929 మంది రైతుల ఖాతాలకు రూ.146.84 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడి రైతులకు సబ్సిడీపై ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 సబ్సిడీ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 31,929 మంది రైతులకు సంబంధించి 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడికి రూ.146.84 కోట్లు డిబిటి పద్ధతిలో నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఇందులో బంగారుపాలెం మండలానికి చెందిన రైతులకు ఎక్కువ మొత్తం జమ అయ్యిందని, జిల్లాలో 20 వేల మందికి పైగా రైతులకు లక్ష రూపాయలకు మించి సబ్సిడీ జమ చేశామన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో లేని విధంగా మామిడి రైతులకు సబ్సిడీ, మద్దతు ధరలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందించిందని, రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి జిల్లా మామిడి రైతాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈక్రాప్ బుకింగ్, క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సబ్సిడీ పరంగా ఖచ్చితమైన నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. అర్హత కలిగి నగదు జమ కాని రైతులు అక్టోబర్ 30వ తేది వరకు తమ వినతులను ఆర్ ఎస్ కె, మండల, జిల్లా స్థాయి ఉద్యాన అధికారులకు అందించాలని వారి అర్హతను 48 గంటలలో నిర్ధారిస్తామన్నారు. రూ.5 లక్షలకు మించి సబ్సిడీకి సంబంధించి 21 మంది రైతులు ఉన్నారని, వీరి అర్హతను పరిశీలించి నగదు జమ చేస్తామన్నారు. గుడిపాల, పుంగనూరు, బంగారుపాళెంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలను మామిడి రైతులకు అందించని కారణంగా ప్రభుత్వం పరంగా పరిశ్రమల శాఖ నుండి ఎలాంటి సహకారం అందించడం లేదని రైతులకు మేలు చేసే పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు, సహకారం అందిస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కేవలం రాజకీయంగా, వ్యాపారపరంగా మాత్రమే కాకుండా రైతుల సంక్షేమాన్ని కొంత వరకు దృష్టిలో ఉంచుకుని పని చేయాలని తెలిపారు.

### 3 ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు రాయితీలు కట్

**చిత్తూరు అర్బన్:** ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా సహకరించని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమలకు ప్రభుత్వం తరపున రాయితీలను కట్ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. రైతులకు సహకరించని మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమలకు ప్రభుత్వం అందించే రాయితీలు నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉపాధి చూపే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. గంగాధరనెల్లూరులోని పాలీహౌస్‌కు సంబంధించి త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు -తచ్చూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న పరిశ్రమలకు దారి ఏర్పాటు చేసేలా నేషనల్ హైవే పీడీ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ 1551 సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా రూ.22 కోట్లతో పరిశ్రమల ఉత్పత్తి ప్రారంభించి 6,577 మందికి ఉపాధి కల్పించామన్నారు. ఇంకా రూ.3,663 కోట్ల పెట్టుబడులతో 52 భారీ, చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. గత మూడు నెలల్లో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా 2,290 దరఖాస్తులు అందగా, అందులో 2,209 మంజూరు చేశామన్నారు. ఎంఎస్‌ఎంఇలకు ప్రోత్సాహ కాలకు సంబంధించి ఆగస్టు 2025 నుంచి ఇప్పటివరకూ డిఐఇపిసికి అందిన దరఖా స్తులలో 38 పరిశ్రమలకు సంబంధించి రూ.3 కోట్లు మంజూరుకు సిఫార్సు చేశా మన్నారు. పిఎంఈజిపి ద్వారా ఈ ఏడాది 148 యూనిట్లకు సంబంధించి రూ.5.88 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, జెడ్ ఎం సుబ్బారావు, ఎల్ డి ఎం హరీష్, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణ భూషణ్ రెడ్డి, పిపాస ప్రతినిధి మధుబాబు పా ల్గొన్నారు.

## గుజ్జు పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలి

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** 'గుజ్జు పరిశ్రమ చెల్లించాల్సిన ఎనిమిది రూపాయలు ఎక్కడ' అని రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జనార్ధన్, మునీశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం నిర్వహించనున్న 'రైతు ఆక్రందన' సభపై మంగళవారం మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల ఆక్రందన సభ నేపథ్యంలో ఒక రోజు ముందు ప్రభుత్వం అందించాల్సిన నాలుగు రూపాయల చొప్పున రూ.146 కోట్లు విడుదల చేయడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.12 ఒకేసారి జమ చేసి ఉంటే రైతులకు సబబుగా ఉండేదన్నారు. నేటికీ ప్రభుత్వం నిర్ణయం అమలు చేసేందుకు గుజ్జు పరిశ్రమల యజమానులు ముందుకు రాని నేపథ్యంలో ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మాట వినకపోతే గుజ్జు పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండు చేశారు. ఆక్రందన సభకు ఆటంకాలు ఏర్పరిస్తే రైతు వ్యతిరేకులుగా ముద్రపడటం ఖాయమన్నారు. భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర, కె.మునిరత్నం నాయుడు, బి.శ్రీనివాస్, సంజీవరెడ్డి, బి.మురళి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మద్దతు ప్రకటించారు.


మాట్లాడుతున్న అఖిల పక్ష రైతుల సంఘాల నాయకులు

## నేడు మామిడి రైతుల ఆక్రందన సభ

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:**

మామిడి టన్నుకు 8 వేల రూపాయలు చెల్లించకుండా జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు మామిడి రైతులను దగా చేయడాన్ని నిరసిస్తూ గురువారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ వద్ద మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతృత్వంలో ఆక్రందన సభ నిర్వహించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మామిడి రైతులకు మామిడి గుజ్జు పరిశ్రమలు టన్నుకు రూ 8 వేలు చెల్లించాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న మామిడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ మామిడి రైతులను దగా చేస్తున్న ఫ్యాక్టరీ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం బంగారుపాలెంలో నిర్వహించనున్న మామిడి రైతుల ఆక్రందన సభకు సిపిఎం అనుబంధ రైతు సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రైతు సంఘం నాయకులు రామానాయుడు, కాటమయ్య, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పోటుగాని భాస్కర్, జనసేన జిల్లా నాయకురాలు కవిత, సిపిఐ ఎంఎల్ నాయకులు వెంకయ్య, వెంకటరత్నంలు మామిడి రైతులకు మద్దతుగా ఆక్రందన సభలో పాల్గొననున్నారు.

## అభివృద్ధికి కృషి చేయాలి

### జిల్లా పర్యాటక అధికారులకు కలెక్టర్ ఆదేశం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** జిల్లా పర్యాటక అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేసి జిల్లాను పర్యాటక రంగంలో ముందంజలో ఉంచే విధంగా సంబంధిత యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని కలెక్టరు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా పర్యాటక మండలి చైర్మన్ సుమిత్ కుమార్, డిఆర్‌ఓ మోహన్ కుమార్, ఆర్డిఓ శ్రీనివాసులు, పర్యాటకశాఖ ఆర్‌డి రవణ ప్రసాద్, దేవదాయ శాఖ సహాయక కమిషనర్ చిట్టెమ్మ, జిల్లా పర్యటక అధికారి నరేంద్ర కుమార్ లతో జిల్లా పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. ఇందులో భాగంగా కైగల్ జలపాతం, పులిగుండు కంగుంది, మొగిలి దేవాలయాలలో తీసుకోవాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం ఐరాల బుగ్గమడుగు జలపాతం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్బరాజా తో చర్చించారు.

## రేపు జాబ్ మేళా

**ప్రజాశక్తి -విజయపురం (నగరి):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ సంయుక్తంగా ఈ నెల 16వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా లో 10 బహుళ జాతీయ సంస్థలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 వరకు వయస్సున్న వారు అర్హులన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు రసూల్‌ను 6300954441, లోకేష్‌ను 9963561755 కు సంప్రదిం చా లన్నారు.

## లింగ నిష్పత్తిని సమానం చేయడం అందరి బాధ్యత



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** లింగ నిష్పత్తిని సమానం చేయడం అందరి బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధి కారులు పేర్కొన్నారు. ఈ నెల 11 వ తేదీ నుంచి 18 వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాలికా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మురుకం బట్టు , ఆంధ్రప్రదేశ్ మైనారిటీ గురుకుల పాఠశాలలో 'లింగ నిష్పత్తిని సమానం చేయడం అందరి బాధ్యత'పై అవగాహన , ర్యాలీ నిర్వహించారు. డెమో మాట్లాడుతూ బాలికలు శారీరకంగానూ, మానసికంగానూ, సామాజికంగా, ఆర్థికం గా అన్ని రంగాలలోనూ ముందంజలో ఉండాలని, వారిపై లింగ వివక్ష చూపరాదని సేవ్ గర్ల్ ఛైల్డ్ భావనతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. బాలికల, బాలుర నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని తెలిపారు. గర్భిణులలో లింగ నిర్ధారణ తెలిపే వారిపై పిసిపిఎన్‌డిటి యాక్ట్ ప్రకారం పది వేల రూపాయల జరిమానా, ఐదు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ప్రతి ఒక్కరూ నిఘా ఉంచాలని తెలిపారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పించడానికి, లింగ వివక్ష రూపుమాపేందుకు, మహిళా సాధికారత కోసం పోరాటమే బాలికాదినోత్సవం ముఖ్య లక్ష్యం అన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిం చారు. బాలికలలో పోషకాహార లోపం, మానసిక ఆరోగ్యం (ఒత్తిడి, గృహహింస, పనిభారం), లైంగిక ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు అవగాహన కలిగి వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభ, స్టాఫ్ నర్సు పుష్ప , టీచర్లు, నాగమ్మ ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## పరీక్షల తనిఖీ

**ప్రజాశక్తి -సోమల:**

ఇరికి పెంట పంచాయతీ మేటి మంద గ్రామంలోని ప్రాథమి క పాఠశాలను ఎంఈఓ శివరత్నమ్మ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఏ2 పరీక్షల విధానం పరిశీలించారు. విద్యార్థులు రాసే విధానం, ఎలా చదువుతున్నారో పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారి వద్ద నుండి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎఫ్ఏ 2 పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎంఈవో


చిత్తూరు కోర్టుకు హాజరైన కుప్పం టిడిపి నాయకులు

## చిత్తూరు కోర్టుకు టిడిపి నేతలు

**ప్రజాశక్తి-కుప్పం:**

కుప్పం నియోజకవర్గానికి చెందిన టిడిపి నేతలు మంగళ వారం చిత్తూరు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు రామకుప్పం మండలం కొల్లుపల్లిలో పర్యటించినప్పుడు చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో టిడిపి నేతలపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి మంగళవారం కుప్పం నియోజకవర్గానికి చెందిన 27 మంది టీడీపీ నేతలు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. వైసిపి హయాంలో పెట్టిన కేసులకు జైలు కెళ్లడంతో పాటు నేటికీ కోర్టులో చుట్టూ తిరుగుతున్నామని పలువురు టిడిపి నేతలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా నేటికీ తప్పుడు కేసులకు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని టిడిపి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గోని వారి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్, కడ అడ్వైసర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్,మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్,మంజునాథ్ కౌన్సిలర్ జాకీర్, అప్పు అప్పు, మునెప్ప, రాజు, నరేష్, సుబ్బు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది

## డాక్టర్ల రిలే దీక్షకు మద్దతు సిబ్బంది నిరసన

**ప్రజాశక్తి -యాదమరి:**

డాక్టర్ల రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ గత 15 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట, చలో విజయవాడ ను నిర్వహించిందన్నారు. ముఖ్యంగా వారికి ప్రొమోషన్స్ ఆలస్యం కావడం, పిహెచ్‌సి డాక్టర్లకు పీజీ చెయ్యడానికి గతంలో 30 శాతం ఉంటే దాన్ని 20 శాతానికి తగ్గించడం లాంటి ప్రధాన డిమాండ్స్ వారికి మద్దతుగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సిబ్బంది అందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి డాక్టర్ల సమ్మెకు మద్ద తు ప్రకటించారు. శ్రీనివాస్ మూర్తి, కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, సెల్వరాని హెల్త్ సూపర్ వైసార్లు, ప్రభావతి, స్టాఫ్ నర్స్, భాను ప్రియా, విష్ణు ప్రియా, దివ్య, సౌందర్య, ఢిలషాద్, సుష్మిత, దుర్గా ప్రసన్న ఎంఎల్ పిహెచ్‌సిలు, శైలజ, సరిత, కళ్యాణి, జ్యోతి, సరస్వతి , పీతంబారి, ల్యాబ్ టెక్నీషియన్, భాస్కర్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పం ఆర్‌టిసి డిపోకు 15.37 ఎకరాలు


ఆర్‌టిసి డిపోకు స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం ఆర్‌టిసి డిపో ఏర్పాటుకు ప్రభుత్వం 15.37 ఎకరాలను కేటాయించింది. కుప్పం మున్సిపాల్టీ కమతమూరు రెవెన్యూ పరిధిలో 3.53 ఎకరాలు, గుట్టపల్లి రెవెన్యూ పరిధిలో 11.84 ఎకరాల స్థలం కేటాయించారు. ఆర్‌టిసి డిపో కోసం కేటాయించిన భూమిని మంగళవారం డిపిటిఓ రాము, ఆ అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం కుప్పం ఆర్‌టిసి డిపో బస్టాండ్ ఒకే చోటు ఉండగా ఆధునిక వసతులతో ఆర్‌టిసి బస్టాండ్‌తో పాటు డిపోను ఏర్పాటు చేస్తామని గతంలో సీఎం చంద్రబాబు పేర్కొన్న నేపథ్యంలో డిపో ఏర్పాటుకు 11.84 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిఈ, ఏఈ, వీఆర్‌వో షఫీ, సర్వేయర్ వరలక్ష్మి, ఆర్‌టిసి యూనియన్ అధ్యక్షులు బలరాం పాల్గొన్నారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు: కమిషనర్


దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీ చేస్తున్న ఎంహెచ్‌వో లోకేష్

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని నగర పాలక ఆరోగ్య అధికారి డాక్టరు లోకేష్ హెచ్చరించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు.. మంగళవారం సాయంత్రం నగరపాలక పరిధిలో పలు దుకాణాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ప్రజారోగ్య విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంహెచ్‌వో ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల బృందం నగరంలోని పొన్నియమ్మగుడి వీధి, చర్చివీధి, సుందరయ్యర్ వీధి, రాముడుగుడి వీధి, బజారు వీధి తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంహెచ్వో మాట్లా డుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై నగరపాలక పరిధిలో ఇప్పటికే అవగాహన నిర్వ హించామని, అయినా దుకాణాల్లో వినియోగి స్తున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. నిబంధన ప్రకారం వీటిని ఉపయోగించ రాదన్నారు. మంగళవారం నాటి తనిఖీల్లో వివిధ దుకాణాల్లో నిలువచేసిన, వినియోగిస్తున్న సుమారు 200 కేజీల సింగల్ యూస్ ప్లాస్టిక్ ను సీజ్ చేసి, రూ.26వేలు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరి కిషన్, అశోక్, శానిటేషన్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## అందరి కృషితోనే స్వచ్ఛ కుప్పం


మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయి అవార్డు రావడం ఎంతో సంతోషంగా వుందని మున్సిపల్ ఉద్యోగు లు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహ కారంతోనే రాష్ట్రస్థాయి అవార్డు సాధించ గలిగామని మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కుప్పం మున్సిపాలిటీ రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం పట్ల మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లు, రెస్కో డైరెక్టర్లు, టిడిపి శ్రేణులు మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయి అవార్డు బాధ్యత మరింత పెంచిందని స్వచ్ఛ కుప్పం.. స్వర్ణ కుప్పం లక్ష్యంగా మరింత కష్టపడి పనిచేస్తామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, వేలు సురేష్, గణపతి, అరవింద్, రెస్కో డైరెక్టర్లు శివ, అర్ముగం, వేణు, నాగభూషణం, దేవా పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన ఇన్సూరెన్స్ నగదు!

- ఎం కొత్తూరు చెరువులో మృతదేహం
- ఎనిమిది నెలల క్రితం హత్య
- పోలీసుల గాలింపు
- కేసును ఛేదించిన పోలీసులు

**ప్రజాశక్తి -విజయపురం (నగరి) :** ఇన్స్యూరెన్సు నగదు ప్రాణం తీసిన వైనం ఇది.. ఎనిమిది నెలల క్రితం ఓ వ్యక్తిని ఇన్సూరెన్సు నగదు కోసం హత్యచేసి చెరువులో పడేసిన కేసును ప్రస్తుతం పోలీసులు ఛేదించారు. మృత దేహం కోసం చెరువలో గాలింపు చేపట్టారు.. పోలీసుల కథనం మేరకు..

నగరి మున్సిపాల్టీ పుదుపేటకు చెందిన పీవీ గుణశీలన్‌కు నలుగురు సంతానం. విజి సంగీత, విజి జ్యోతి, విజి వసంత్, విజి విజయ్. వీరిలో పెద్దకుమారుడు విజి వసంత్ చెన్నైలో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరనివాసం ఉండగా కుమార్తెలు విజి సంగీత తిరుత్తణిలో, విజి జ్యోతి నారాయణవనంలో వివాహమై నివసిస్తున్నారు. విజి. విజయ్‌కి పుదుపేటలోనే గంగాధరం కుమార్తె కౌసల్యతో వివాహమైంది. అయితే కుటుంబ తగాదాలతో వివాహమైన ఆరు నెలలకే అతను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అప్పటికే అతను ఇన్స్యూరెన్స్ పాలసీ వేసి వుండటంతో ఇన్స్యూరెన్స్ డబ్బులు రూ.1.25 కోట్లు వచ్చింది. ఈ నగదు గుణశీలన్, కళావతి ఖాతాలకు జమ అయింది. అయితే ఇన్సూరెన్స్ డబ్బులో తన కుమార్తెకు కూడా వాటా ఇవ్వాలని వియ్యంకుడైన గంగాధరం గొడవపడేవాడు. ఈ దశలో తిరుత్తణిలో భర్తను పోగొట్టుకొని విడిగా ఉన్న కుమార్తె విజి సంగీత వద్దకు గుణశీలన్ భార్యతో పాటు వెళ్లిపోయాడు. పుదుపేటలో ఇల్లు ఖాళీ చేయడంతో ఆ ఇంటిని అయ్యప్పన్ అనేవ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. మాటల్లో గుణశీలన్ వద్ద డబ్బులున్న విషయాన్ని గ్రహించిన అయ్యప్పన్ అప్పుగా రూ.28 లక్షలు తీసుకున్నాడు. ఈ డబ్బుల్లో రూ.3.60 లక్షలు మాత్రమే ఇచ్చాడు. మిగిలిన డబ్బుల ఇవ్వాలంటూ తరచూ గుణశీలన్ అడిగేవాడు. ఇలా వుండగా గుణశీలన్ ఈ ఏడాది జూన్ 6వ తేదీ నుంచి కనిపించలేదు. దీంతో కుమార్తె సంగీత తిరుత్తణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. నెలలు గడచినా కనుక్కోకపోవడంతో ఉన్నత స్థాయి అధికారులను ఆమె సంప్రదించడంతో కేసులో వేగం పెరిగింది. అనుమానితుడైన అయ్యప్పను విచారించగా హత్య చేసిన సంగతి బహిర్గతమైంది. అప్పు అడుగుతున్నాడని కోపంతో ఉన్న అయ్యప్పన్, ఇన్స్యూరెన్స్ డబ్బులు ఇవ్వలేదని కోపంతో ఉన్న గంగాధరం హత్యకు వ్యూహ రచన చేశారు. జూన్ 6వ తేది మధ్యాహ్నం గుణశీలన్ (65)ను నగరిలోని ఇంటికి తీసుకు వచ్చారు. తల వెనుకవైపు బలమైన కట్టెతో కొట్టగా అతను మృతి చెందాడు. చీకటి పడ్డాక ఇద్దరూ కలిసి మృతదేహాన్ని గోనెసంచిలో చుట్టుకొని నగరి మండలంలోని ఎం కొత్తూరు చెరువు కట్టవద్దకు చేరుకున్నారు. అక్కడే ముక్కలుచేసి చెరువులో వేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో అంగీ కరించారు. దీంతో మంగళవారం సాయంత్రం చెరువు వద్దకు నిందితులతో పాటు పోలీసులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపును, పోస్టుమార్టంను బుధవారంకు వాయిదా వేశారు.


చెరువులో మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు


హత్యకు గురైన గుణశీలన్

## ఈకేవైసీ తప్పనిసరి

### ఉపాధి జాబ్ కార్డు దారులకు ఏపీవో సూచన

**ప్రజాశక్తి-సోమల:** మండలంలో ఉపాధి జాబ్ కార్డు కలిగి పనులు చేస్తున్న వారు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఉపా ధి హామీ ఏపీవో షౌకత్ అన్నారు. మంగళ వారం నెల్లిమంద సోమల పంచా య తీల పరిధిలో గ్రామాలకు వెళ్లి జాబ్ కార్డు కలిగి వున్న ఈ కేవైసీ చేయించుకోని వారికి మొబైల్ ద్వారా ఈకేవైసీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఈకేవైసీ చేయిస్తున్న ఏపీవో షౌకత్

## స్క్రీనింగ్ లక్ష్యాలు వంద శాతం సాధించాలి

**జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి వెంకట ప్రసాద్**

**ప్రజాశక్తి-తవణంపల్లి:** సచివాలయాల పరిధిలో స్క్రీనింగ్ లక్ష్యాలు వంద శాతం సాధించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు జి వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తవణంపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి వెంకట ప్రసాద్ తవణంపల్లె పిహెచ్‌సిని మంగళవారం సందర్శించారు. ఏంఎల్‌హెచ్‌పిలకు టెలికాంఫెన్స్ ద్వారా టిబి ముక్త భారత్‌లో భాగంగా వల్నరబుల్ పాపులేషన్ స్క్రీనింగ్ లక్ష్యాలను ప్రతి సచివాలయం లోనూ పరిశీలించి వీలైనంత త్వరగా వంద శాతం ఆన్ లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. క్షయపై ప్రజలకు వ్యాధి లక్షణాలు నివారణ మార్గాలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ జ్ఞాన శేఖర్ , ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్ గోవి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్య కర్తలు సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీని వాసులు , ల్యాబ్ టెక్నీషియన్ శేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సోషల్ మీడియా వదంతులు నమ్మొద్దు

**డిఎస్‌పి సాయినాథ్**



**ప్రజాశక్తి- పూతలపట్టు:** సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని డిఎస్‌పి సాయినాథ్ పేర్కొన్నారు. పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం దినేష్ అనే వ్యక్తి పూతలపట్టు పోలీస్ స్టేషన్ సిబ్బంది విధులకు ఆటంకం కల్పిస్తూ సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియా ద్వారా హల్‌చల్ చేశాడన్నారు. రంగంపేట క్రాస్ వద్ద ఆగి ఉన్న కారును దినేష్ ద్విచక్ర వాహనంలో వెనుక భాగంలో ఢీకొన్నాడని, సంబంధిత కారు వాహన దారులు మద్యం తాగి దినేష్‌ను మానవత్వంతో కాపాడే ప్రయత్నం చేశాడు. అయినా మద్యం మత్తులో వారిపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు సమాచారం అందింది. స్టేషన్ కు తీసుకొచ్చి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఇంటికి వెళ్లిన ఆ వ్యక్తి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు అన్యాయం చేశారని వీడియో తీసి సోషల్ మీడియా లో పెట్టారన్నారు. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి నందుకు మరో కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

## ఆపదలో ఆదుకోలేదన్న నెపంతోనే..

**ఎవరితో నాకు ఎలాంటి ప్రాణ హాని లేదు : దినేష్**



**ప్రజాశక్తి- పూతలపట్టు:** పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన సమయంలో పలువురు టిడిపి నాయకులకు ఫోన్ చేస్తే స్పందించలేదని ఆ కోపంతోనే నాయకులు యువరాజ నాయుడు, దొరబాబు చౌదరి, గణపతి నుంచి తనకు ప్రాణహాని వుందని చెప్పానని దినేష్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం నుంచి సోషల్ మీడియాలో దినేష్ వీడియోలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఆయన తాగిన మైకంలో పొరపాటు చేశానన్నారు. తనకు ఎవరి నుంచి ఎలాంటి ప్రాణహాని లేదని తెలిపారు. తన వీడియోలను కొందరు వారి స్వార్థం కోసం వాడుకున్నారని తెలిపారు. తాము చివరి వరకు టిడిపిలోనే కొనసాగుతానని వివరించారు.

## పాఠ్యపుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి-సోమల:** మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 3,008 మంది విద్యార్థులకు ఒకటి నుండి పదవ తరగతి వరకు సెమిస్టర్ టు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్టు ఎంఈఓలు విజయకుమారి ,శివరత్నమ్మ తెలిపారు. సెమిస్టర్ వన్ పాఠ్యపుస్తకాలు పాఠశాల ప్రారంభంలో అందించామని, సిలబస్ పూర్తి చేసుకుని పరీక్షలు కూడా నిర్వహించామని ఇప్పుడు సెమిస్టర్ టు పుస్తకాలు ప్రభుత్వానికి అందించడంతో వీటిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేసి అందులోని పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించడం బోధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి సోమశేఖర్, సిబ్బంది అస్లాం నారాయణ లావణ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సీఐ శుభాకాంక్షలు

**ప్రజాశక్తి -కార్వేటినగరం :** ప్రభుత్వ విప్, జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్‌కు ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి రావడంతో సీఐ శిరీష దేవి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖకు నూతన భవనం తొందర్లో మంజూరు అవుతుందని తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ, సిబ్బంది, టిడిపి నాయకులు చెంగల్రాయుల యాదవ్, హేమంత్ రెడ్డి మోహన్ మురళి బీగాల రమేష్ ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డాక్టర్ రుక్మిణి పర్యవేక్షణలో మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులకు పారిశ్రామిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ద్వారా స్టార్ట్ ఇండియా, స్టాండప్ ఇండియా మీద అవగాహన కల్పించడమే కాక, భవిష్యత్తులో విద్యార్థులు ఎటువంటి పరిశ్రమలు, వ్యాపారాలు ,ఎలా మొదలు పెట్టాలి? వివిధ రకాలైన పరిశ్రమలు, వ్యాపారంలో పాటించాల్సిన మెలుకువలు, జాగ్రత్తలు గురించి చక్కని ఉదాహరణలతో మాస్టర్ ట్రైనర్ ధనంజయ వివరించారు. ఇందులో పాల్గొన్న 60 మంది విద్యార్థులకు క్యూఆర్ కోడ్ ద్వారా ఎంఎస్ఎంఎ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకం నష్టాలపై అవగాహన

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు మండలంలో పెంగరగుంట గ్రామం.లో అధిక రసాయనిక ఎరువుల వల్ల కలిగే నష్టాలపై ఆవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వరి పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన రమణారెడ్డి పొలాన్ని సందర్శించారు. రమణారెడ్డి రైతు రెండు సంవత్సరాలుగా యూరియా లేక ఇతర ఏ రకమైన రసాయనిక ఎరువులు వాడకుండా వరి పంటను సాగుచేస్తున్నారు. ద్రవ జీవామృతం వేసుకుంటూ పచ్చిరొట్టె ఎరువులు పేడ ఎరువు వాడుతూ భూమి కాలుష్యం, వాతావరణ కాలుష్యం, పంటు నాణ్యత కాపాడు తున్నారు. ఇలాంటి పంటను మిగిలిన రైతులకు చూపించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాయకులు నాగరాజరెడ్డి, నక్షత్రయ్య, రైతుకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## తగ్గిన జీఎస్‌టీని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి -పలమనేరు:** పలమనేరు పట్టణ పరిధిలో పురపాలక సంఘ ప్రాంగణంలో మునిసిపల్ కమిషనర్ రమణా రెడ్డి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్స్‌తో సమావేశం బిల్డింగ్ మెటీరియల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వం నిర్దేశించిన రేట్లను జిఎస్‌టి ధరల ఆదా పట్టికపై అవగాహన కల్పించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద సూచికలు ఏర్పాటు చేయండి: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -తవణంపల్లి:** రహదారిపై వంతెనలు ఉన్న చోట్లు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారులకు సూచించారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలిగిరి మురళీమోహన్ తవణంపల్లి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారుల్ని బ్రిడ్జిలను పరిశీలించారు. దెబ్బతిన్న అరగొండ, గాజులపల్లి, తోడతర గ్రామాలకు చెందిన డ్యాడ్‌లను పరిశీలించారు. రోడ్లు, భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో మాట్లాడి వంతెనల వద్ద భద్రతా సూచనలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా భారీ వాహనాలు ప్రవేశించకుండా నిరోధించవచ్చన్నారు. ప్రమాదం జరగకుండా చూడవచ్చని ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలు ప్రయాణిం చడానికి వీలుగా ప్రత్యామ్నాయ దారులు సిద్ధం చేయా లన్నారు. దీనివల్ల సమీప గ్రామాలకు రాకపోకలకు సౌకర్యంగా ఉండేందుకు, స్కూల్ బస్సులు కూడా ప్రయాణించడానికి సరైన దారులు సిద్ధపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, గాలి దిలీప్ కుమార్ , క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వంతెనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్





ఎంపిపి స్కూలు ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఎంపిపి స్కూలుకు ప్రహరీ నిర్మాణం

**ప్రజాశక్తి- తవణంపల్లి:** మండలంలోని మాధవరం పంచాయతీ ఏం బోయపల్లిలో 20 సంవత్సరాలుగా ఎంపియుపి స్కూల్‌కి ప్రహరీ లేదు. తేలికపాటి వర్షం పడినా వర్షపు నీరు పాఠశాల భవనంలోకి చేరి విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు, నాయ కులకు విన్నవించినా ఎలాంటి చర్య చేపట్టలేదన్నారు. ఇప్పు డు క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్ నాయుడును గ్రామ ప్రజలు అభ్యర్థించగా పాఠశాలను పరిశీలించి మండల అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరికి తెలిపారు. వారిద్దరూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఏం బోయపల్లి పియుపి పాఠశాలకు వచ్చి అధికారులు ఎన్ఆర్ఐ జేఏసీ కింద సుమారు 3 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఈ ప్రసాద్ నాయుడు, ఏఈ జై చంద్ర రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్ పాల్గొన్నారు.



నీవా నదికి జలహారతి పడుతున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## నీవా నదికి జల హారతి

**ప్రజాశక్తి- యాదమరి:** యాదమరి మండలం కాశిరాళ్ల వద్ద భూమిరెడ్డిపల్లె వెళ్లి మార్గంలో నీవానది ఉధృతంగా ప్రవ హిస్తోంది. కె గొల్లపల్లె హైస్కూలు ప్లస్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయురాలు ఎపి లలిత, ఉపాధ్యాయులు మంగళవారం జలహారతి ఇచ్చారు. మండలంలోని ప్రజలు సుఖ సంతోషాలతో రైతులు సస్యశ్యామలంగా పంటలు పండించుకునే అవకాశం ఇవ్వాలని గంగను వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, కనకాచారి, మదన్ మోహన్ రెడ్డి, మధుసూదన్, చిట్టిబాబు, అరుణ, కె భారతి, మంజుల, షర్మిల పాల్గొన్నారు.



పెద్దిరెడ్డికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## వరసిద్ధిని సేవలో మాజీ మంత్రి

**ప్రజాశక్తి- ఐరాల:** శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు నియోజక వర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, కుటుం బ సమేతంగా మంగళ వారం దర్శించు కున్నారు. ఆలయ సూపరింటెండెంటు వాసు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత థామస్, ఆలయ మాజీ చైర్మన్లు మోహన్ రెడ్డి, జగన్నాథ రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ఐరాల:** వరసిద్ధిని కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణబసప్ప దర్శనపూర్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించు కున్నారు. వీరికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంటు వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

## ఇచ్చిన మాట ప్రకారం సబ్సిడీ జమ: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టన్నుకు నాలుగువేల రూపాయలు సబ్సిడీని మామిడి రైతుల ఖాతాలో జమ చేశామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ మామిడి రైతుల సబ్సిడీ కోసం ప్రభుత్వం 174 కోట్ల రూపాయలను విడుదల చేసిందన్నారు. రైతుల సంక్షేమాన్ని టిడిపి ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సి ఆర్ రాజన్, దొరబాబు, కోదండ యాదవ్, మోహన్ రాజ్ ,త్యాగరాజులు టిడిప్పి రైతు నాయకులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు మద్దతు ధర రూ.4 విడుదల

**ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం):** మామిడి రైతులకు మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4 విడుదల చేసిందని ఉద్యాన శాఖ అధికారిణి మాధవి లత తెలిపారు. గంగవరం మండలంలోని మొత్తం 481 మంది రైతులకు, 6127.3 మెట్రిక్ టన్నులకు 245 లక్షల రూపాయల సబ్సిడీ విడుదల చేసిందన్నారు. ఆధార్‌కు లింకు అయిన ప్రతి రైతుకు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో జమ చేశారన్నారు.

## లిక్కర్ మాఫియా చేసింది మీరే కదా?

**- వైసీపీపై మండిపడ్డ వియం థామస్**

**ప్రజాశక్తి -కార్వేటినగరం:** ఆంధ్ర నుండి ఆఫ్రికా దేశం వరకు లిక్కర్ మాఫియా చేసింది వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన అనుచరులు నారాయణస్వామి అని రాష్ట్ర విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. మంగళవారం కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సొమ్మును రూ.3,500 కోట్లు వరకు వైసిపి నాయకులు సంపాదించుకున్నారని ఈ లిక్కర్ మాఫియా కేసులో చాలామంది ఇప్పటికే రిమాండుకు వెళ్లారన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. నారాయణ స్వామి కృపాలక్ష్మి మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సిట్ అధికారులు 'మీ ఇంటికి వస్తే నాకు ఏమి తెలియదని చెప్పలేదా? కృపాలక్ష్మి కాణిపాకం వచ్చి లిక్కర్ స్కామ్‌లో నాకు ఒకరూపాయి కూడా తీసుకోలేదని సత్యం చేయగలవా?' అన్ని కృపాలక్ష్మికి సవాల్ విసిరారు. మా నాయకుడు చంద్రబాబు నాయుడు అవినీతికి దూరంగా ఉండాలని నియోజకవర్గ ప్రజలకు మంచి పనులు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని పిలుపు నిచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయంలో గ్రావెల్లోనూ ఇసుకలోను రాత్రులు ఎర్రచందనం స్మగ్లింగ్‌లు చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. వారు చేసే ఈ వీధి నాటకాలు ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో తిరుమల టికెట్లు అమ్ముకొని జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర పొల్యూషన్ డైరెక్టర్ నగలపాటి నాగేశ్వర రాజు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, లోకనాథం రెడ్డి, రుద్రయ్య నాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు జనార్ధన్ రాజు, నాయకులు రవి యాదవ్, బిగల రమేష్, ఎమ్మెల్యే సోదరులు వి రాజా, డ్యామ్ చైర్మన్ అన్నామలై, రామచంద్రారాజు, సురేష్ వర్మ, పొద్దుటూరు రాజా, దాసరి గణేష్, రాధాకృష్ణ యాదవ్, మురళీమోహన్, ఎం మురళి, కృష్ణమారాజు, తిరుమలనాథ్, ఢిల్లీ బాబు రెడ్డి, పరాందాం, ప్రకాష్, ప్రసాద్, అమ్ములు, రక్కుబాబు పాల్గొన్నారు.



## క్రాప్ సర్వేపై అవగాహన

**ప్రజాశక్తి-సోమల:** మండలంలో రైతులు సాగుచేసిన పంటలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా ఏ విధంగా నమోదు చేయాలో వీఆర్వోలకు మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పంట నమోదు విధానంలో రైతు వివరాలు లొకేషన్ తదితర అంశాలు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే విధానాన్ని తీసుకువచ్చి నూతన విధానంలో ఎలా పంట నమోదు చేయాలో మొత్తం యాప్‌లో పొందుపరిచారని దీన్ని వీఆర్వోలు అవగాహన చేసుకుని డిజిటల్ క్రాప్ సర్వేని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మధుసూదన్, వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## దిగజారుడు రాజకీయాలు సరికాదు: టిడిపి

**ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:** మామిడి రైతులు విషయమై వైసిపి నేతలు వారి ఉనికి కోసం లేనిపోని దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ మోహన్ నాయుడు ధ్వజమెత్తారు. మండల కేంద్రమైన గంగాధర నెల్లూరులో మంగళవారం సాయంత్రం టిడిపి నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సాధక బాధలు తెలియడం వల్లే సీఎం చంద్రబాబు నాయుడు మామిడి రైతులకు తోతాపురి టన్నుకు రూ. 4వేలు చేయూత అందజేస్తామని 4 నెలల క్రితమే ప్రకటించారని పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు మండలంలో 1,445 మంది మామిడి రైతులకు రూ.7.71కోట్లు నిధులు విడుదలైందని చెప్పారు. అనంతరం టిడిపి నేతలు స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలోటిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీకర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నియాజ్ అలీ, కోదండ రెడ్డి, దేవరాజులు, జిల్లా టిఎన్ టియుసి అధికార ప్రతినిధి జీవ రత్నం, టిడిపి యువ నాయకుడు హరీష్ యాదవ్, నాయకుడు పురుషోత్తమ నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

## బాలికలకు ప్రత్యేక శిక్షణ

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు దేశమ్మ అధ్యక్షతన, అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సావిత్రి హాజరై విలువైన ఉపన్యాసం అందించారు. ఆమె మాట్లాడుతూ బాలికల ఎదుగుదలలో పోషకాహారపు ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం పై అవగాహన కలిగి వుండాలన్నారు. విద్య ద్వారా స్వయం సాధికారత, లింగ నిర్ధారణ చట్టబద్ధంగా నిషిద్ధమని అవగాహన కల్పించారు.





ఈ సమావేశంలో సూపర్వైజర్ రెడ్డమ్మ , పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, వివిధ తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు.

## చెరువులకు పూజలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని నక్కనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నచెరువు పూర్తిగా నిండడంతో గ్రామ ప్రజలు రైతులు ఆనందంతో భక్తిశ్రద్ధలతో రణ గంగమ్మ దేవస్థానానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న ఆలయంలో పూజలు చేపట్టారు.ఈ సారి బైరెడ్డిపల్లి మండలంలో వర్షాలు పుష్కలంగా పడటంతో పాటు హంద్రీ-నీవా జలాలు కూడా నక్కనపల్లి చెరువులోకి వచ్చి చేరాయి. దీనివల్ల గ్రామ చెరువులు నిండిపోవడంతో, వ్యవసాయ రైతులలోఆనందం వెల్లివిరిచింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గంగమ్మ తల్లికి కృతజ్ఞతగా ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జల హారతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని నక్కనపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పి. రఘునంద గుప్తా సతీసమేతంగా సమర్పణతో నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, నాయకులు భువనచంద్ర గౌడ్, పళని పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు తరువాత తీర్థప్ర సాదాలు పంపిణీ చేశారు.



## టాటా నెర్వ్ కేంద్రం ప్రారంభం: కలెక్టర్

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** చిత్తూరు జిల్లాలో సంజీవిని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ అమలు కోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానం కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వం సంజీవిని ప్రాజెక్ట్‌ను విజయవంతంగా అమలు చేశామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సంజీవిని హెల్త్ కేర్ ప్రాజెక్టు పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కుప్పం నియోజక వర్గంలో ప్రభుత్వం సంజీవిని హెల్త్ కేర్ ప్రాజెక్ట్‌ను విజయ వంతంగా అమలు చేయడం జరిగిందని, దీని విజయాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం సంజీవిని హెల్త్‌కేర్ ప్రాజెక్ట్‌ను మొత్తం చిత్తూరు జిల్లాకు విస్తరించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ అమలును సులభతరం చేయడానికి, జిఎస్‌డబ్ల్యుఎస్ విభాగం నుండి గృహ డేటా పొందారన్నారు. ఆరోగ్య శాఖ నుండి ఏబిహెచ్ఎ ఐడి డేటా సేకరించారు. ఈ సంజీవిని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం ప్రతి వ్యక్తి రికార్డులో ఇవి ఉన్నాయని నిర్ధారించుకోవడమని, చెల్లుబాటు అయ్యే పని చేసే మొబైల్ నంబరును సంజీవిని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ విజయవంతానికి ఈ రెండు అవసరమని కలెక్టర్ తెలిపారు.



## నిరాశ్రయులకు ప్రత్యేక వైద్య శిబిరం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంలో భాగంగా నిరాశ్రయులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నట్లు సపోర్ట్ సంస్థ అధ్యక్షులు, నిరాశ్రయుల వసతి గృహ నిర్వాహకులు జోసఫ్ రాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం చిత్తూరు నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ వేడుకలో భాగంగా నిరాశ్రయులకు వైద్య శిబిరం నిర్వహించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ టెలిఫోన్ కాలనీ చిత్తూరు వారి సహకారంతో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మీనాక్షి, సూపరువైజరు పవనమ్మ, ఏఎన్ఎం రేవతి, ఆశ వర్కర్ రాధా, పవన, గణేష్, లత, పూర్ణిమ నిరాశ్రయులకు వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోసఫ్ రాజు మాట్లాడు తూ ప్రపంచ నిరాశ్ర యుల దినోత్సవంలో భాగంగా నిరాశ్రయులకు మెరుగైన ఆరోగ్య శిబిరం నిర్వహించామన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లు, సిబ్బంది రావడం నిరాశ్రయుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపటం చాలా అభినందనీయమన్నారు. డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరాశ్రయులకు మెరుగైన ప్రత్యేకమైన వైద్య శిబిరం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ప్రమీల, ఇంద్రాణి, శ్రీజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు

## బ్యాంకు రుణాలు సద్వినియోగంపై ఆరా

**ప్రజాశక్తి-సోమల:** మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలు పొందిన రైతులు వాటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు? బ్యాంకు సిబ్బంది రుణాలను సకాలంలో అందిస్తున్నారా? వడ్డీలు ఏ విధంగా వేస్తున్నారు? సిబ్బంది సహకారం ఎలా ఉంది?' అంటూ కేంద్ర బృందం మంగళవారం కందూరు, పగడాల వారి పల్లి గ్రామాలలో రైతులతో మాట్లాడారు. రైతు అభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తోందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందు తున్నారా? అని వివరాలను పలువురు రైతులు వద్దనుండి సేకరించి వాటిని నమోదు చేసుకుని వెళ్లినట్టు సమాచారం.

## శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి: జిల్లా ఏజీఎం

**ప్రజాశక్తి -సోమల:** మండలంలో శ్రీనిధి ద్వారా రుణాలు పొందిన డ్వాక్రా సంఘాలలోని సభ్యులు సకాలంలో రుణాల బకాయిలను చెల్లించాలని శ్రీనిధి ఏజీఎం వేణు అన్నారు. మండలంలో శ్రీనిధి రుణాలు తీసుకొని చెల్లించని సంఘాలను ఆయన పరిశీలించి సభ్యులతో రుణాలు చెల్లించాలని మీరు శ్రీనిధి బకాయిలు చెల్లించకుండా ఉంటే మిగిలిన వారికి మళ్లీ శ్రీనిధి రుణాలు ఇచ్చే అవకాశం లేకుండా పోతోందని , తీసుకున్న రుణాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు గంగోజి వాహిద్ సంఘమిత్ర లు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలి: టిడిపి

**ప్రజాశక్తి- రామకుప్పం:** మండలం లోని బందార్లపల్లి పంచాయతీ, లింగాపురంలో మంగళవారం ఉచిత రక్త పరీక్షల శిబిరంలో ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మధుమేహం పరీక్షలు, లివర్ ప్రొఫైల్, కిడ్నీ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, సిబిసి వంటి 47 రకాల పూర్తి రక్త పరీక్షలు చేసి ఫలితాలు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, కోదండ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి, ముని రెడ్డి, మునినారాయణ రెడ్డి,మోహన్ బాబు, చంద్రబాబు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం: టిడిపి

**ప్రజాశక్తి -కార్వేటినగరం :**

చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు నాగేశ్వరరాజు మాట్లాడుతూ మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ హామీని నెరవేర్చిం దన్నారు. మామిడి రైతులను నట్టేట ముంచడానికి పలు ఫ్యాక్టరీలు, రైతులకు కనీసం గిట్టుబాటు ధర కల్పించకుండా తగిన సమయంలో వారికి పర్మిట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుంటే ముఖ్యమంత్రి స్పందించి మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇస్తూ ప్రతి రైతుకి కేజీకి నాలుగు రూపాయలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రైతుల ఖాతాలోకి కేజీకి నాలుగు రూపాయలు చొప్పున జమ చేశారన్నారు. ఈ సందర్భంగా మామిడి రైతులందరి తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి , కూటమి ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## షాది ఖానా అభివృద్ధే లక్ష్యం

**ప్రజాశక్తి-కుప్పం:**

కుప్పం షాదీ ఖానాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని షాది ఖానా నూతన చైర్మన్ సర్దార్ బాష పేర్కొన్నారు. కుప్పం షాది ఖానా నూతన కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పి కే యం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ను మైనార్టీ నేతలతో కలిశారు. ఈ సందర్భంగా సర్దార్ బాషను ఘనంగా సత్కరించారు. షాది ఖానా అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆన్సర్, డైరెక్టర్లు ఫరూక్, అబ్దుల్ గఫర్, షానాజ్, మధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇర్ఫాన్, నబి ఉమర్, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్మీ పండుగ

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:**

మండల పరిధిలోని నక్కనపల్లి గ్రామ కేంద్రంలో వెలసియున్న హజరత్ ఖాజా బాబా దర్గాలో గ్యార్మీ పండుగ మంగళవారం నాడు ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. హిందూ ముస్లిం సోదరులు ఐకమత్యంతో పాల్గొని, ఈ పవిత్ర పర్వదినాన్ని ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు. ఈ గ్యార్మీ పండుగను ప్రతి యేటా ఘనంగా నిర్వహించడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. దర్గాకు హాజరైన భక్తులు మొక్కొందరు. మొక్కులు తీరిన అనంతరం ఉర్సు సందర్భంగా ఖాజా గరీబున్నవాజ్ (రహ్మతుల్లాహి అలైహి) పేరిట పచ్చజెండాలను ఎగురవేసి తమ భక్తి నిబద్ధతను చాటుకున్నారు. పండుగ సందర్భంగా దర్గా ప్రాంగణంలో అన్నదానం చేశారు. స్థానిక ముస్లింలు దాతృత్వాన్ని చాటుతూ, పేద ప్రజలకు భోజనం అందించడం శుభపరంపరగా కొనసాగిస్తున్నారు. దర్గా వద్ద శాంతి, సౌహార్ద వాతావరణం నెలకొని, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మండలంలోని ముస్లిం సోదరులు విస్తృతంగా పాల్గొని పండుగ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. భవిష్యత్తులో మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అందరి సహకారం కావాలని వారు కోరారు.